వర్షం వస్తే చుట్టూ తిరగాల్సిందే..!

- శిథిలావస్థకు చేరిన నుదురుపాడు శివారు చప్టా
- వంతెన నిర్మించాలని కోరుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



నుదురుపాడులోని చప్టా.

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామ శివారులోని వాగు ఒడ్డు చప్టా ప్రమాదకరంగా మారింది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన చప్టా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలం వచ్చిందంటే చప్టా పై నుంచి 6 అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తుంది. దీంతో పొలాలకు, పాఠశాలలకు వెళ్లాలంటే ప్రజలు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి.

చుట్టూ తిరిగి రావాల్సిందే

గ్రామానికి శివారు చప్టా అవతలగా 14 ఏళ్ల కిందట వాగు ఒడ్డు కాలనీ ఏర్పడింది. ఇక్కడ 70 కుటుంబాల ప్రజలు నివసిస్తున్నారు. వారు గ్రామంలోకి రావాలంటే చప్టా దాటి రావాల్సిందే. నీరు వచ్చిన సమయంలో వివిధ పనుల నిమిత్తం గ్రామంలోకి రావాలంటే రాష్ట్ర రహదారి మీదుగా చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు. అంతేకాక రైతులు, కూలీలు పొలం పనులకు వెళ్లాలన్నా ఇదే దారి కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. వాగు నీటి ఒరవడి తగ్గేదాక ఆగి పనులకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశు వైద్యశాల, జెడ్పీ పాఠశాల ఈ ప్రాంతంలోనే ఉండటంతో పాడి రైతులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడి వాగు వస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు.

+ చప్టా శిథిలావస్థకు చేరి ఎన్నో ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎన్నోసార్లు అధికారులు, నాయకులకు విన్నవించినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



బ్రిటీష్ కాలంలో నిర్మించిన చప్టా పూర్తిగా దెబ్బతింది. ఆ దారిన వెళ్లాలన్నా రైతులు, విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడాల్సి వస్తుంది. నూతనంగా వంతెన నిర్మించాలి.

– చల్లా సీతారామిరెడ్డి, నుదురుపాడు

సమస్యను పరిష్కరించాలి



గ్రామం నుంచి జెడ్పీ పాఠశాలకు విద్యార్థులు వెళ్లాలన్నా, కాలనీ నుంచి గ్రామంలోకి రావాలన్నా వర్షం పడిన సమయంలో భయపడాల్సి వస్తుంది. చుట్టూ తిరిగి గ్రామంలోకి వెళుతున్నాం. సమస్యను పరిష్కరించాలి.

– వి.మస్తాన్‌రావు, కాలనీ వాసి

క్లుప్తంగా

కాలువ తీయాలని రైతుల వినతి



దుగ్గిరాల: వర్షపు నీరు, మురుగునీరు పంట పొలాల్లో నుంచి బయటకు పోయే విధంగా చిన్న కాలువ తీయాలని, తద్వారా పంటలు దెబ్బతినకుండా ఉంటాయని రైతులు తహసీల్దారు ఐ.సునీతకు మంగళవారం వినతి పత్రం అందించారు. మోరంపూడి గ్రామానికి చెందిన రైతులు 40 ఎకరాలలో పంట నీట మునిగి తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని తెలియజేయగా, తహసీల్దారు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ గోపాలరావు, మోరంపూడి వీఆర్‌వోకు సమస్యను వివరించారు. కార్యక్రమంలో ఎస్.కరణాకర్, జి.మోహన్‌రావు, కె.రమేష్, టి.రాజు, పి.వేంకటేశ్వరరావు, కె.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ రహదారి సమస్యపై వినతి



దుగ్గిరాల: దుగ్గిరాల రైలుపేటలోని బోసు బొమ్మ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా తయారయింది. దీనిపై స్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ద్వారా తెలియపరచామని విశ్రాంత పంచాయతీ అధికారి బాపయ్య చౌదరి తెలిపారు. పలువురు పసుపు యూనియన్ లీడర్స్‌తో కలిసి ఆయన మంగళవారం దుగ్గిరాల స్టేషన్ సూపరింటెండెంట్ టి.శ్రీనివాసరావుకు రోడ్డు పూర్తిగా బురదమయం అయ్యిందని, స్టేషన్‌కి రావడానికి బాగా ఇబ్బంది పడుతున్నామని, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని వివరించారు. సానుకూలంగా స్పందించిన స్టేషన్ సూపరింటెండెంట్ ఉన్నతాధికారులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బుస్సా వరప్రసాద్, కె.వేంకటేశ్వర్లు, సాంబశివరావు, బుజ్జి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా చిన్ని తిరుపతయ్య



మంగళగిరి టౌన్: సీపీఐ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శిగా మంగళగిరి నగరానికి చెందిన చిన్ని తిరుపతయ్య ఎంపికైనట్లు మంగళవారం పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రజల హక్కులను కాపాడడమే ప్రధాన లక్ష్యమని, కార్పొరేట్‌లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను ఖండిస్తానని చిన్ని తిరుపతయ్య తెలిపారు. ఈ సందర్భంగా నగర పరిధిలోని పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు చిన్ని తిరుపతయ్యకు అభినందనలు తెలిపారు.

మట్టి గణపతిని పూజించి కాలుష్యాన్ని నివారించాలి

నూతక్కిలో ప్రజలకు అవగాహన కల్పించిన కేఎల్‌యూ విద్యార్థులు



నూతక్కి(మంగళగిరి): వినాయక చవితికి మట్టి గణపతి ప్రతిమలను పూజించి కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడాలని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని నూతక్కి గ్రామంలో మంగళవారం వర్సిటీ విద్యార్థులు ఇంటింటికి తిరిగి పర్యావరణాన్ని ఎలా కాపాడాలి, కాలుష్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మట్టి వినాయకులను పూజించి ఇంటి తోటలో లేదా కుండీలలో నిమజ్జనం చేయడం వలన పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో లైంగిక వేధింపులపై అవగాహన సదస్సు



ప్రసంగిస్తున్న రాయపాటి శైలజ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్, మార్పు ట్రస్ట్, పాయింట్ మీడియా సంయుక్త ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నివారణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ విచ్చేసి ప్రసంగిస్తూ విద్యార్థులు, మహిళలకు పని ప్రదేశాలు, చదువుకునే ప్రదేశాలలో భద్రత, లింగ సమానత్వం గురించి వివరించారు. 10 మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్న ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటును లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 తప్పనిసరి చేసిందని తెలిపారు. హైకోర్టు న్యాయవాది అనుపమ దార్ల, మార్పు ట్రస్ట్ డైరెక్టర్ రావూరి సూయిజ్‌లు మాట్లాడుతూ ఫిర్యాదులను దాఖలుకు చట్టపరమైన విధానాలు, వేధింపులను నివారించడంలో యాజమాన్యం పాత్ర, దర్యాప్తులో గోప్యత ప్రాముఖ్యతను వివరించారు. లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్సిటీ కార్యదర్శి కోనేరు కాంచనలత, వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎస్.వెంకటరామ్, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ రూతు రమ్య, కో కన్వీనర్ డాక్టర్ కె.సోనీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మంగళగిరి టౌన్: ఈ నెల 23 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పిలుపునిచ్చారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం మహాసభల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ మహాసభల ద్వారా ప్రజల జీవన సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని చర్చలు జరిపి ప్రత్యామ్నాయ విధానాలను రూపకల్పన చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, కూలీలు, కార్మికులు, నిరుద్యోగ యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ మహాసభలను నియోజకవర్గంలోని అన్ని శాఖల పార్టీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించిన కేఎల్‌యూ విద్యార్థులు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎక్సెన్‌టేషన్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో చిర్రావూరు గ్రామంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి విభాగపు అధికారి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలంలో పరిశుభ్రత పాటించకపోతే అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, నీరు, చెత్తచెదారం లాంటివి నిల్వ లేకుండా చూసుకోవాలని వివరించారు. మురుగు నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో చెక్కపొట్టు, వరిపొట్టులో కిరోసిన్ కలిపి ఉండలు చేసి వేస్తే దోమలు పెరిగే అవకాశం ఉండదని వర్సిటీ విద్యార్థులు గ్రామస్తులకు వివరించారు. డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం నిర్వహించిన వారిని వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎస్.వెంకటరామ్, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, విద్యార్థి విభాగం అడ్వైజర్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు అభినందించారు.

వేతనాలు చెల్లించకుంటే ప్రత్యక్ష ఆందోళన



డీటీవో చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పెదబాబు, నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: దుగ్గిరాల మండలంలో ఉప ఖజానాధికారి(ఎస్టీవో) వైఖరి కారణంగా ఉపాధ్యాయులకు నిలిచిన వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకోని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానాధికారి కార్యాలయంలో డీటీఓకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా పెదబాబు మాట్లాడుతూ ఇటీవల బదిలీల ప్రక్రియలో భాగంగా స్థాన చలనం పొందిన ఉపాధ్యాయులకు జూన్‌కు సంబంధించిన వేతనాలు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టీవోలందరూ చెల్లింపులు జరిపారని తెలిపారు. అయితే దుగ్గిరాల మండలంలో బదిలీలు కాని ఉపాధ్యాయులను బదిలీల సమాచారం అందలేదనే సాకుతో అక్కడి ఎస్టీఓ వేతనాలు చెల్లించలేదన్నారు. ఇదమేని అడిగితే ఎస్టీఓ కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని డీటీవో దృష్టికి తెచ్చారు. గత 20 ఏళ్లుగా ఉన్న హెచ్‌ఆర్‌ఏ వర్తించదని, అదనంగా తీసుకున్న హెచ్ఆర్ఏను తిరిగి చెల్లించాలని ఉపాధ్యాయులకు నోటీసులు పంపారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు జీతభత్యాలు చెల్లించాలని కోరితే ఇటువంటి నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, తక్షణమే నోటీసులను ఉపసంహరించుకోని పక్షంలో దుగ్గిరాల ఉప ఖజానా కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

పాఠశాలకు బీరువా అందజేత



పాములపాడు(తాడికొండ): మండలంలోని పాములపాడు ఎస్సీ కాలనీలో పాఠశాలకు రూ.10 వేల విలువైన బీరువాను వైఎస్సార్‌సీపీ నాయకులు పరుచూరి నారాయణ బహూకరించారు. పాఠశాలలో రికార్డులు భద్రపరుచుకునేందుకు బీరువా అవసరమని ఉపాధ్యాయులు కోరిన మేరకు స్పందించిన ఆయన నూతన బీరువాను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు చదువుకునే పాఠశాలకు తన వంతు సాయం అందించడం సంతోషంగా ఉందని, సమాజ సేవలో భాగస్వామ్యం అయ్యేందుకు తన కుటుంబం ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట నష్ట పరిహారం అందించాలి



దుగ్గిరాల: రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులకు పంట నష్టపరిహారం సాయం రూ.10 వేలు అందించాలి. ఏపీ కౌలు రైతు సంఘం కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం దుగ్గిరాల పంచాయతీ కార్యదర్శి వివేకానందకి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా అధిక వర్షాల వల్ల పంట నష్టం వాటిల్లిన కౌలు రైతులకు రూ.10వేలు అందించాలని అన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యలు త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, కిషోర్, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో స్వామిత్వపై క్షేత్రస్థాయి సర్వే



పెదకాకాని: స్వామిత్వ ప్రక్రియపై పెదకాకాని క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నట్లు డిఎల్‌పీఓ శ్రీనివాసరావు తెలిపారు. పెదకాకాని గ్రామాన్ని గత కొంతకాలం క్రితం డ్రోన్‌తో సర్వే నిర్వహించి చాయా చిత్రాన్ని రూపొందించారు. ఈ విధానం ద్వారా గ్రామంలో ఉన్న ఇల్లు, ఇళ్ళ స్థలాల పొడవు, వెడల్పులతో విస్తీర్ణం కూడా అంచనా వేయడం జరిగింది. డ్రోన్ సర్వే పరిశీలనలో బాగంగా మంగళవారం పెదకాకాని గ్రామంలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. స్వామిత్ర ప్రోగ్రాం ద్వారా డ్రోన్ సర్వే, ప్రస్తుతం నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి స్థాయి సర్వేకి వ్యత్యాసం ఏమీ లేదని, కొలతలు ఒకే విధంగా ఉన్నాయని డిఎల్‌పీఓ తెలియజేశారు. ఈ క్షేత్రస్థాయి సర్వేలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు, రాజారాం, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో అధిక లాభాలు

ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ ఉమాదేవి



ఫిరంగిపురం: ప్రధాన పంటతోపాటు రైతులు అంతర పంటలు సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ ఎ.ఉమాదేవి అన్నారు. మండలంలోని అమీనాబాద్ యూనిట్ పరిధిలోని వేములూరిపాడు, తక్కెళ్లపాడు, మునగపాడు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంట పొలాలను మంగళవారం ఆమె పరిశీలించి, మాట్లాడుతూ ప్రధాన పంటతోపాటు అంతరపంటలుగా గోరుచిక్కుడు, జొన్న, సజ్జ, బెండ వంటివి వేసుకోవాలని చెప్పారు. సాలుకు సాలుకు మధ్య పట్టిల్లో మినుము, పెసర వంటివి వేసుకోవాలన్నారు. వాటితోపాటు ఎరపంటలుగా ఆముదం, బంతి, తీగ జాతి కూరగాయల మొక్కలు వేసుకోవడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం రైతులకు ద్రవ జీవామృతం తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ చింతా వరప్రసాద్, జిల్లా మోడల్ మేకర్ ఇర్ల వెంకటేశ్వర్లు, వైఆర్ఎఫ్ పి.అవినాష్, యూనిట్ ఇన్‌చార్జి జె.రామకృష్ణ, కె.పెద్దారావు, కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి ఆర్థిక సాయం



క్రీడాకారిణి సాదియాకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి టౌన్: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా ఆల్మాస్‌కు మంత్రి నారా లోకేష్ ఆర్థిక సాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. నార్త్ అమెరికాలోకి కోస్టారియాలో ఈ నెల 24వ తేదీ నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు జరగనున్న అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలకు భారతదేశం నుంచి మంగళగిరి నియోజకవర్గానికి చెందిన సాదియా ఆల్మాస్ పాల్గొననున్నారని, ఈ నేపథ్యంలో చాంపియన్ షిప్‌లో పాల్గొనడానికి మంత్రి నారా లోకేష్ రూ.2.5 లక్షలు ఆర్థిక సాయాన్ని స్థానిక టీడీపీ నాయకుల చేతుల మీదుగా మంగళవారం సాదియాకు అందజేశారు. అడిగిన వెంటనే ఆర్థిక సాయం అందజేసిన మంత్రి నారా లోకేష్‌కు సాదియా కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కిరణ్‌చంద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షిపై అక్కసు.. పత్రిక ప్రతులు దహనం

తాడికొండ: తాడికొండ ఎమ్మెల్యే కార్యాలయం వేదికగా అవినీతి జరుగుతుందని టీడీపీ కార్యకర్తలే చెబితే అన్ని పత్రికలు రాసిన కథనాలను పక్కనబెట్టి ఒక్క సాక్షి పత్రికపైనే అక్కసు వెళ్లగక్కుతూ రాజధానిలో నిరసనలు తెలియజేయడం పట్ల సొంత పార్టీ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు. తాము ఆరోపించింది షాడో అవినీతిపై అయితే ఒక్క సాక్షిలోనే తప్పుడు కథనం రాశారని, మిగిలిన పత్రికల్లో వచ్చిన కథనాలపై నోరెత్తకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తుళ్లూరులో అసలు ఈ విషయానికి సంబంధమే లేని కొందరు యువకులతో నిరసన చేశారు. అలాగే సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేశారు. దీనికి తోడు తుళ్లూరు, తాడికొండ పోలీస్‌స్టేషన్‌లలో రాజధాని ముంపునకు గురైందని రాసిన సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. కాగా నీరుకొండ, కృష్ణాయపాలెం, నేలపాడు, శాఖమూరు, పెదపరిమి పలు ప్రాంతాల్లో ఇప్పటికీ వరద నీరు తాండవిస్తుండగా ముంపు లేదంటూ బుకాయించడం గమనార్హం.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలి



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ కార్యదర్శి కె.స్టీవెన్‌లతో కలసి సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కార్మికులకు నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్బారావు, ఆశీర్వాదం, అంకయ్య, సూర్యప్రకాష్, కార్మికులు కాసమ్మ, రమణ, నాగమల్లేశ్వరి, శారద, సువర్ణకుమారి, రిబ్కా తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత రైతులను ఆదుకోవాలి




తహసీల్దార్ కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెదకాకాని: వరదలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పెదకాకానిలో తహసీల్దార్ పి.కృష్ణకాంత్‌కు రైతులతో కలిసి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మండలంలోని రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల పంటలు వేసిన రైతులు నష్టపోయారని, ముఖ్యంగా వరి పంట ఒకటి రెండుసార్లు సుమారు 20 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వేస్తే అది నీటిపాలైందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి తక్షణమే పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు వర్తింప జేయాలన్నారు. ఇటీవల అధిక వర్షాలు వరదల్లో నష్టపోయిన పంటకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పని దినాలు 200 రోజులు పెంచి రోజుకు 600 కనీస వేతనం ఇవ్వాలన్నారు. గుంటూరు చానల్ కొండవీటి వాగు ఇతర పంట కాలవలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయాలని కోరారు. రైతు సేవ కేంద్రాల్లో విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, అందుబాటులో ఉంచాలన్నారు. పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్ స్పందిస్తూ తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉల్లంగుల శివయ్య, తన్నీరు సాంబశివరావు, చెన్నం మోహన్, పసుపులేటి రఘు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో ఘనంగా సోషల్ వర్క్ దినోత్సవం

పెదకాకాని (ఏఎన్‌యు): ఆచార్య నాగార్జున వర్సిటీలోని సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగంలో మంగళవారం 6వ జాతీయ సోష ల్ వర్క్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య యం త్రిమూర్తిరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ప్రొఫెషనల్ సోషల్ వర్క్ ఇన్ ఇండియా (ఎన్‌ఏపిఎస్‌ఈబ్ల్యుఐ) సహకారంతో ఆగస్ట్ 15 నుంచి 21 వరకు నేషనల్ సోషల్ వర్క్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా బ్రిడ్జింగ్ కేర్ అండ్ కంపోషన్- సోషల్ వర్క్ ఇన్ హెల్త్ సెట్టింగ్స్ అనే ఇతివృత్తంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యం సురేష్ కుమార్ మాట్లాడుతూ సోషల్ వర్క్ ప్రాముఖ్యతను తెలియజేశారు. సామాజిక బాధ్యత గల పౌరులను సోషల్ వర్క్ విభాగం తయారు చేస్తుందన్నారు. విభాగం అధ్యాపకులు, సోషల్ సైన్స్ డీన్, సీడీఇ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్ఏపీఎస్‌ఈబ్ల్యుఐ ఆధ్వ ర్యంలో జరుగుతున్న కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. బీఓ ఎస్ చైర్మన్, మాజీ పాలక మండలి సభ్యులు ఆచార్య సరస్వతీ రాజు అయ్యర్ మాట్లాడుతూ ప్రజల్లో వస్తున్న మానసిక సమస్యలు, ఇతర రుగ్మతలపై సోషల్ వర్కర్లు కల్పిస్తున్న అవగాహనను వివరించారు. ఆచార్య ధనలక్ష్మి మాట్లా డుతూ ప్రస్తుత ప్రపంచీకరణలో సోషల్ వర్కర్ల బాధ్యత విలువైనదిగా పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అతిథి అధ్యాపకులు డాక్టర్ పి.రాజ్ కుమార్, డాక్టర్ డి.రాజశేఖర్, పరిశోధకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శుక్ల యజుర్వేద పారాయణ, హవనం



మంగళగిరి: లోక కల్యాణార్థం, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని సంపూర్ణ శుక్ల యజుర్వేద పారాయణ, హవనం, మహా పూర్ణాహుతి నిర్వహించినట్లు నిర్వాహకులు వెంకట సాయి వరప్రసాద్ తెలిపారు. నగర పరిధిలోని యర్రబాలెంలో వేద పాఠశాల నిర్వాహకులు వెంకట సాయి వరప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీమాన్ ఘనాపాటి రావూరి లీలాపక మనోజ్ అధ్యాపనంలో 13 మంది విద్యార్థులు వేద అధ్యయనం చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న సంపూర్ణ శుక్ల యజుర్వేద పారాయణ, హవనం, సోమవారం రాత్రి 10 గంటలకు మహా పూర్ణాహుతి సమర్పణతో ముగిసింది.